# ఈ దారి

## ఎక్కడికి?

ఆవాళ ఆదివారం-

రాజా, గిరి, అశోక్, వెంకట్ యూనివర్సిటీ విద్యార్థులు. ఆ నలుగురూ ఒక బ్యాచ్.

ఉదయాన్నే స్ట్రాంగ్ బీర్ పీకలదాకా పట్టించి, కాకాహోటల్లో చాప్స్, చపాతీ బాగా మెక్కి, కారాకిళ్ళీ స్పెషల్‌గా వేయించుకుని, బుగ్గల దట్టించారు.

అలా జాలీగా రోడ్డుమీది కొచ్చేటప్పటికి— రిక్షాలు దిగి, రోడ్డు కావలవైపు నిలబడివున్న జడ పిన్నులూ గట్రా నిండిన తోపుడు బండి చుట్టూ మూగుతున్న అమ్మాయిల బృందం కనిపించింది.

ఒకే చెట్టుకు పూసిన అనేక రంగుల పువ్వుల్లా నిగనిగలాడి పోతున్నారు వాళ్ళు.

కారాకిళ్ళీ మిత్రబృందం కళ్ళు జిగేల్‌మన్నాయ్– కడుపులో బీరు గేరు మార్చింది. ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

"ఇవాళ మన ప్రోగ్రామ్ ఏమిటి?" విలాసంగా విజిల్ వేస్తూ అడిగాడు రాజా.

"సింపుల్—వెరీ సింపుల్— మధ్యాహ్నంవరకూ రోడ్లు చుట్టడం. కనిపించిన కన్నెపిల్లనల్లా కన్ను కొట్టడం". అంటూ చెప్పుకుపోతున్న గిరికి అడ్డు తగిలి, "మధ్యాహ్నం మళ్ళీ ఇరాని హొటల్లో బిరియానీ బిగించడం—మాట్నీ షోని పావనం చేయడం" అన్న అశోక్ ముందుకు వచ్చి అసలు సిసలైన విషయంతో ముగించాడు వెంకట్. "సాయంకాలం పీకలదాకా మందు కొట్టేసి, హాస్టల్ చేరుకొని అమరులై పోవడం"—

నలుగురూ సిగరెట్ల పొగల్లో సెగలు కక్కుతున్నట్లున్నారు.

"రొటీన్" అని పెదవి విరిచాడు రాజా

"ఇవాళ స్పెషల్" అన్నాడు గిరి, తళుక్కున ఒక ఐడియా తలలో మెరిసే సరికి.

"హౌ?" అందుకున్నాడు అశోక్.

'మనలో ఒకరు ఆ బృందంలో అమ్మాయిల్లో ఒకరిని జడపట్టి లాగి, క్రింద పడవేసి, థ్రిల్ చేయాలి. వాడికి మిగిలిన ముగ్గురం మూడు వారాలు వరసగా మందు ఖర్చులు భరించాలి. అతడే మనలో మిగిలిన వారికి హీరో! ఓ. కే?' వివరించాడు గిరి.

"ఇంతకూ మనలో ఆ మగాడు ఎవరు?" అని తన సందేహాన్ని వెలిబుచ్చాడు వెంకట్. 'మీరంతా సై అంటే ఆపని నేనే చేస్తాను. నేనే హీరోనవుతాను. ఓ. కే.?" అన్నాడు కాలర్ పైకెత్తి గిరి.

మిగిలిన ముగ్గురూ ఒప్పుకున్నారు.

పర్చేజింగ్ పూర్తి చేసుకుని ఆ అమ్మాయిల బృందం మళ్ళీ రిక్షాలు ఎక్కబోతున్నారు

"అరే! పిట్టలగిరి పోతున్నాయ్— హర్రీ యప్...." ఉద్రేకంగా ఉత్సాహపరిచాడు రాజా. మిగిలిన ఇద్దరూ ఆత్రుతగా గిరిని ముందుకు తోశారు

గిరి పరుగునవెళ్ళి, అప్పటికే రిక్షాల్లోకి ఎక్కిన అమ్మాయిల్లో ఒక అమ్మాయిని వెనకనుంచి జడ పట్టుకుని క్రిందికి లాగాడు. ఒక్క కేకతో రోడ్డుమీద పడిపోయిన ఆ అమ్మాయి—తన జడ పట్టుకుని, పరాభవించిన వ్యక్తి దెస రోషంగా చూసి, అంతలోనే ఆశ్చర్యపోయి, "అన్నయ్యా" అన్నది పొంగుకొస్తున్న దుఃఖంతో పవిటను నిండా కప్పుకుంటూ,

ఆ అమ్మాయి అదే యూనివర్సిటీలో మరో కాలేజీలో చదువు కుంటున్న గిరి చెల్లెలు!!

❋

